ఆదివారం ప్రత్యేకం

తిరుమల తిరుపతి దేవస్థానాల ఈవో అన్నది ఒక విశేషమైన హోదా. ఒక పవిత్రమైన బాధ్యత. ఐఏఎస్ కెరీర్‌లో అరుదైన అవకాశం. దేశం నలుమూలలనుంచీ వచ్చే భిన్న ప్రాంతాల, భిన్న భాషల, భిన్న ఆహారపు అలవాట్లున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా సంతృప్తికరంగా శ్రీవారి దర్శనం చేయించడం నిత్య సవాలు. తిరుమలలో చిన్న కదలిక కూడా జాతీయ వార్తగా వైరల్ అయిపోతుంది. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ సకల విభాగాల యంత్రాంగాలనూ నడిపించాలి. టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన జె.శ్యామలరావు నెలన్నరగా తిరుమల అంతా సుడిగాలిలా తిరిగారు. ప్రతిదీ ప్రత్యక్షంగా పరిశీలించి ఆనుపానులు తెలుసుకున్నారు. ఆ తర్వాతే సమీక్షలకు దిగి సరిదిద్దే చర్యలకు ఉపక్రమించారు. పరిశీలన, అవగాహన, గుర్తించిన లోపాలు, చేయబోయే మార్పుచేర్పుల గురించి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా సంభాషించారు. అందులోని ముఖ్యాంశాలు....

- తిరుమల, ఆంధ్రజ్యోతి

■ ఇంటర్వ్యూ

టీటీడీకి పటిష్ఠమైన ఐటీ అవసరం



జె.శ్యామలరావు

1997 బ్యాచ్ ఐఏఎస్, సొంతూరు కాకినాడ. 11ఏళ్లు అసోంలో విధులు. 2009-11 మధ్య విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు. మెడికల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ బోర్డులకు ఎండీగా చేశారు. కమర్షియల్ టాక్స్ జీఎస్టీ కమిషనర్‌గానూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శిగానూ విధులు నిర్వహించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి టీటీడీ ఈవోగా జూన్ 16న వచ్చారు.

లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి

క్యూలైన్లలో భక్తులకు అవస్థల్లేకుండా చర్యలు

వారాంతపు క్యూలైన్లపై ప్రత్యేక శ్రద్ధ

ఎక్కువమంది భక్తులు సంతృప్తికరంగా శ్రీవారిని దర్శించుకునేలా చేయడమే నా ప్రథమ ప్రాధాన్యం. ఎలాంటి ప్రణాళికలు లేకుండా వచ్చే భక్తులతోనే క్యూలైన్లు పెరిగిపోతున్నాయి. వారాంతపు క్యూలైన్లలో భక్తులు ఇబ్బందిపడకుండా నారాయణగిరిలో అదనపు షెడ్ నిర్మించాలని నిర్ణయించాం. ఇక్కడ 5నుంచి 6వేల మంది భక్తులు కూర్చోవచ్చు.ఆలయంలో సేవలు, కైంకర్యాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటే అధిక సంఖ్యలో భక్తులకు దర్శనం కల్పించవచ్చని అర్థమయ్యింది. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా క్యూలైన్లలో భక్తుల కదలికలను పరిశీలించి సంఖ్యను నియంత్రించవచ్చు. ఇక, భక్తులు అధిక సమయం క్యూలైన్‌లో నిలబడి ఇబ్బందిపడే అవసరం లేకుండా స్లాటెడ్ సర్వ దర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లు వారానికి 1.47 లక్షలకు పెంచాం. దీనిని గతంలోలా 1.67 లక్షలకు పెంచుతాం. ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే బయటకు వ్యాపించిన క్యూలైన్లను తనిఖీ చేసినప్పుడు చాలా లోపాలు కనిపించాయి. అక్కడ అందించే ఆహారపదార్థాల నాణ్యత బాగాలేదని, కనీసం తాగు నీరు ఇచ్చేవాళ్లు కూడా లేరని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరనే ఫిర్యాదులు వచ్చాయి. పిల్లలకు పాలు అందడం లేదని ఓ భక్తురాలు నా దగ్గరకు వచ్చి ఏడ్చింది. సీఎంగారు కూడా ఇవే సమస్యల మీద దృష్టి పెట్టమని చెప్పారు. అన్నప్రసాదాల వితరణకు ఓ పద్ధతి ప్రకారం వ్యవస్థ లేదని గుర్తించా. ఈ క్రమంలో బయటికి వ్యాపించిన క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయంగా ఆహార పదార్థాలు అందించేందుకూ, అందేలా పర్యవేక్షించేందుకూ ప్రత్యేకంగా ముగ్గురు ఏఈఓ స్థాయిల్లో అధికారులను మూడు షిఫ్టుల్లో ఉండేలా నియమించా. అలాగే బయట క్యూలైన్ మొత్తానికి కలిపి 3 శాశ్వత ఫుడ్‌కౌంటర్లు ఏర్పాటు చేశాం. వారాంతాల్లో పర్యవేక్షణకు ఎస్వీబీసీ సీఈవోకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ఫుడ్ పెట్టడం లేదనే విమర్శలకు అవకాశం ఇవ్వకుండా ఎక్కడ, ఎప్పుడు ఫుడ్ అందించామనే సమాచారం తెలిసేలా జీపీఎస్ ఇనేబుల్ కెమెరాల ద్వారా తీసిన ఫొటోలు సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసే వ్యవస్థను తీసుకువచ్చాం. బయటి క్యూలైన్ల వద్ద మరుగుదొడ్ల సమస్యను అధిగమించేందుకు మొత్తం ఆరు టాయిలెట్లు భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చాం.

పారిశుధ్య నిర్వహణ తీరు మారాలి

ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణ సంతృప్తికరంగా లేదు. కాంట్రాక్టర్లు సరిపడినంతమంది సిబ్బందిని పెట్టడం లేదు, కావాల్సిన మెటీరియల్ ఇవ్వడం లేదు. పనితీరుపై పర్యవేక్షణ ఇప్పటి వరకు లేకుండా పోయింది. ఈ పరిస్థితులు గమనించి మార్పులు చేస్తున్నాం. మొహమాటాలకు తావులేదు.పారిశుధ్యం సరిగా లేకపోతే కాంట్రాక్టు రద్దుచేస్తామని హెచ్చరిస్తున్నాం.

మరింత శుద్ధజలం

తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల నిషేధం తర్వాత చాలా మంది భక్తులు జలప్రసాద కేంద్రాలపై ఆధారపడుతున్నారు.ఎప్పటికప్పుడు జలప్రసాద కేంద్రాల నుంచి శాంపిల్స్ తీసుకుని పరీక్షిస్తున్నాం.అలాగే గాజుబాటిళ్ల విక్రయంలో దుకాణదారుల తీరుపై వస్తున్న విమర్శలు పరిశీలించి హెచ్చరించాం. నిబంధనలను ఉల్లంఘిస్తే దుకాణాలను సీజ్ చేస్తాం. నీటి సరఫరాకు ప్రముఖ సంస్థలను కూడా ఆహ్వానిస్తున్నాం. ప్రస్తుత ధరకే విక్రయించేందుకు ముందుకు వస్తే లైసెన్సులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం.

కాలినడక భక్తులకు టోకెన్లు

గతంలో అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో నడిచివచ్చే భక్తులకు ప్రత్యేకంగా దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవాళ్లు. అయితే వాటిని తొలగించారు. నేను వచ్చాక శ్రీవారిమెట్టులో తిరిగి టోకెన్లు జారీ చేస్తున్నాం. అలిపిరి మార్గంలో కూడా ఇవ్వాలంటూ చాలామంది అడుగుతున్నారు. అయితే ఇప్పటికే చాలా రకాల దర్శనాలు అమల్లో ఉన్నాయి. ఈ క్రమంలో వీటి జారీ వల్ల ఏదైనా సమస్య వస్తుందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఆలయ క్యూలైన్ల నిర్వహణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ మార్గంలో టోకెన్ల జారీపై దృష్టి పెడతాం. స్థానికులకు దర్శనం కల్పించడంపై కూడా త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

లడ్డూకి పూర్వ వైభవం

లడ్డూ నాణ్యత పెంపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పోటు కార్మికులు, అధికారులు, గతంలో పనిచేసి వెళ్లిన అధికారులతో సమీక్షలు నిర్వహించాం. లడ్డూ తయారీలో ముఖ్యమైనది నెయ్యి. రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ఉండాలి. గతంలోకన్నా ఇప్పుడు వాడుతున్న నెయ్యి నాణ్యతలో లేడావుందని గుర్తించాం. ఇకపై క్వాలిటీ నెయ్యి రావాలని సంబంధిత టెండరుదారులను హెచ్చరించాం. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్న ఓ సంస్థపై నిషేధం విధించాం. అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేకమైన ల్యాబ్‌ను తిరుమలలోనే ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న ముడిసరుకుల నాణ్యతను పరిశీలిస్తాం. మంచి నాణ్యమైన సరుకులు వినియోగించడం ద్వారా లడ్డూకి పూర్వవైభవం తీసుకురావచ్చు.

అన్నదానంలో మోడరన్ కిచెన్

అన్నప్రసాదాల్లోని అన్నం ముద్ద కడుతోందని, బియ్యంలో నూకలు కలుస్తున్నాయని చాలా ఫిర్యాదులున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇటీవల ఏపీ, తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులతో సమీక్ష నిర్వహించాం. నాణ్యత పర్యవేక్షణకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశాం. అసోసియేషన్ నుంచి ఒకరు,టీటీడీ అన్నప్రసాద విభాగం నుంచి ఒకరు, కొనుగోళ్ల విభాగం నుంచి మరొకరు బియ్యం నాణ్యతను నిత్యం పరిశీలిస్తారు. నాణ్యత లేదని స్పష్టమైతే ఆ బియ్యం ఏ రైస్‌మిల్ నుంచి వచ్చిందో గుర్తించి ఆ మిల్లర్‌పై అసోసియేషన్ నిషేధం విధించాలని కోరాం. దానికి అసోసియేషన్ సభ్యులు కూడా అంగీకరించారు. అలాగే వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు సంతృప్తికరంగా నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో అన్నప్రసాదాలు అందించేందుకు అతిపెద్ద క్యాటరింగ్ సర్వీస్ సంస్థ 'కాంపస్' సహకారం తీసుకోబోతున్నాం. స్టోర్, కిచెన్, పారిశుధ్యం, సర్వింగ్, ట్రాన్స్‌పోర్టు ఇలా అన్నిటిలోనూ వాళ్లు కొన్ని సూచనలు చేస్తారు. వీళ్లు ఉచితంగానే ఈ సేవలను టీటీడీకి అందించబోతున్నారు. అన్నప్రసాదాల నాణ్యత పెంపుకోసం ఫుడ్‌టెక్నాలజీ, హోటల్ మెనేజ్‌మెంట్, క్యాటరింగ్ నిపుణులతో కూడా చర్చించాం.వంటశాలలో ఉన్న పాత యంత్రాలను తొలగించి అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు చేస్తాం. సిబ్బందిని కూడా సరిపడా పెంచుతాం. రానున్న 25 ఏళ్ల వెనక్కి తిరిగి చూసే అవకాశం లేకుండా ఆధునాతన కిచెన్‌ను సిద్ధం చేస్తాం.

ఆర్గానిక్ నైవేద్యాల రుచిపై ఫిర్యాదులు

శ్రీవారికి నివేదించే నైవేద్యాలను ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ముడిసరుకులతో సమర్పించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ప్రసాదాలు రుచికరంగా లేవనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై కూడా చర్చించాం. అసలు టీటీడీకి అందుతున్నవి ఆర్గానిక్ ముడిసరుకులేనా కాదా, వాటి నాణ్యత ఎలా ఉందని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. కుకింగ్‌లో మార్పులు తీసుకురావాలనే సూచనలు వచ్చాయి. పరిశీలిస్తున్నాం.

ఐటీ విభాగం వీక్

దర్శనం, వసతి, ఆర్జితసేవల ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ తీరును పరిశీలిస్తున్నాం. ముఖ్యమైన ఐటీ విభాగం చాలా బలహీనంగా ఉంది. ఐటీలోని లోపాలను అవకాశంగా మార్చుకుని ఒకే మొబైల్, ఈమెయిల్ ద్వారా వందల సంఖ్యలో లక్కీడిప్ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవడాన్ని గమనించాం. వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసుకుని దర్శనాలు, సేవలు పొందుతున్నారు. అలాగే నకిలీ ఆధార్ నెంబర్లతోనూ టికెట్లు, గదులు తీసుకుంటున్నారు. శ్రీవాణి టికెట్లు కూడా ఫేక్ ఐడీలతో బుక్ చేస్తున్నారు. ఇప్పటికే పలు ఫోన్‌నెంబర్లను, మెయిల్స్‌ను బ్లాక్ చేయడంతో పాటు ఫేక్ ఆధార్ నెంబర్లతో, ఒకే నెంబరు, మెయిళ్ల ద్వారా చేసుకున్న కొన్ని బుకింగ్స్‌ను రద్దు చేశాం. ఇక, ఫేక్ ఆధార్‌లను అరికట్టేందుకు ఆధార్ సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడాం. ప్రత్యేకంగా తయారు చేసిన అప్లికేషన్‌తో ఆధార్ నిజమైనదా కాదా అని నిర్ధారించుకునే వ్యవస్థను మరో 20 రోజుల్లో ఏర్పాటు చేయబోతున్నాం. ఐడీని మార్చడం పెద్ద క్రైం. ఎట్టిపరిస్థితిలో వీళ్లను విడిచిపెట్టకూడదు. భవిష్యత్తులో ఐటీ విభాగాన్ని పటిష్టం చేసి అక్రమాలకు అవకాశం లేకుండా చేస్తాం. అనుభవం కలిగిన మంచి అధికారి పర్యవేక్షణలోకి ఐటీ విభాగాన్ని తీసుకురాబోతున్నాం. ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీలో దళారీలను అరికట్టేందుకు ఫొటోతో టోకెన్ ఇచ్చే విధానాన్ని కూడా అమలుచేస్తున్నాం.

42మంది తహసీల్దార్లకు పోస్టింగ్

● పెండింగ్‌లో తిరుపతి రూరల్ మండలం ● కలెక్టరేట్ ఏవో జయరాములు బదిలీ ● నూతన ఏవోగా భారతి?

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 3: జిల్లాలో 42 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ శనివారం అర్ధరాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి రూరల్ మినహా మిగిలిన అన్ని మండలాలకు పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతి రూరల్ మండలంలో అత్యధికంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడంతో నిబద్ధత కలిగిన తహసీల్దారును నియమించేందుకు ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నారు. మండలాల వారీగా.. తిరుపతి అర్బన్‌కు కేపీ భాగ్యలక్ష్మి, చంద్రగిరికి ఎ.శివరామ్‌సుబ్బయ్య, పాకాలకు జె.నిత్యానందబాబు, ఆర్‌సీపురానికి కె.వెంకటరమణ, వడమాలపేటకు జరీనా, పుత్తూరుకు వి.సురేష్‌బాబు, ఎర్రావారిపాళెంకు పరమేశ్వరస్వామి, చిన్నిగొట్టిగల్లుకు జనార్దనరాజు, శ్రీకాళహస్తికి డి.లక్ష్మీనారాయణ, తొట్టంబేడుకు యు.మధుసూదనరావు, రేణిగుంటకు జీసీ వెంకటేశ్వర్లు, ఏర్పేడుకు ఎం.భార్గవి, కేవీబీపురానికి దస్తగిరయ్య, నాగలాపురానికి హనుమాన్ నాయక్, పిచ్చాటూరుకు రమేష్ బాబు, నారాయణవనానికి ఎం.జయరాములు, బీఎన్‌కండ్రిగకు ఐ.సుబ్రహ్మణ్యం, వరదయ్యపాళెంకు పి.రాజశేఖర్, సత్యవేడుకు టీవీ సుబ్రహ్మణ్యం, ఓజిలికి ఎ.పద్మావతి, నాయుడుపేటకు పి.గీతావాణి, పెళ్లకూరుకు పి.అనురాధ, సూళ్లూరుపేటకు ఎస్.నరసింహారావు, తడకు బి.పద్మావతి, గూడూరుకు ఎస్.చంద్రశేఖర్, చిల్లకూరుకు కె.రవికుమార్, కోటకు కె.జయజయరావు, వాకాడుకు ఎస్.రామయ్య, చిట్టమూరుకు ఐఎస్ ప్రసాద్, బాలాయపల్లికి కేవీఆర్‌వీ ప్రసాద్, వెంకటగిరికి మునిలక్ష్మిని నియమించారు.

కలెక్టరేట్‌కు ఆరుగురి కేటాయింపు

కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లకు సూపరింటెండెంట్లుగా నియమించడానికి ఆరుగురు తహసీల్దార్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీరిలో.. పి.భారతి, పి.శిరీష, కె.కుప్పయ్య, ఎం.రోశయ్య, పి.లక్ష్మీనరసింహం, బీఆర్‌కే శివప్రసాద్ ఉన్నారు. కాగా, కలెక్టరేట్ ఏవో జయరాములు నారాయణవనం తహసీల్దారుగా బదిలీ కావడంతో ఈయన స్థానంలో భారతిని నియమించనున్నట్లు తెలిసింది.

నలుగురు డీటీలను ఇన్‌చార్జిలుగా..

నెల్లూరుజిల్లా నుంచి వచ్చిన నలుగురు డిప్యూటీ తహసీల్దార్(డీటీ)లను ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియమించారు. డీవీసత్రానికి పి.శైలకుమారి, దక్కిలికి ఎం.శ్రీనివాసులు నియమితులయ్యారు. హరికృష్ణను కలెక్టరేట్‌కు, గూడూరు ఆర్డీవో కార్యాలయానికి శిరీషను కేటాయించారు.

ఆర్డీవో కార్యాలయాల ఏవోలు వీరే..

ఆర్డీవో కార్యాలయాలకు ఏవోలుగా పి.రూన్సీలక్ష్మి (తిరుపతి) సిరిశ్రీదేవి (శ్రీకాళహస్తి), ఎస్.ద్వారకనాథరెడ్డి (సూళ్లూరుపేట), శిరీష (గూడూరు)ను నియమించారు.

టీటీడీ సీవీఎస్వోగా శ్రీధర్



తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్వో)గా ఎస్.శ్రీధర్ నియమితులయ్యారు. గతంలో సీవీఎస్వోగా ఉన్న నరసింహకిషోర్‌ను ఇటీవల బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న శ్రీధర్‌ను ఆ పోస్టులో నియమించారు.

దర్గాలో హైకోర్టు న్యాయమూర్తి ప్రార్థనలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 3: శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నది ప్రాంతంలో వెలసిన హజరత్ జుంలేషాపీర్ దర్గాలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శనివారం ప్రార్థనలు చేశారు. దర్గా ప్రాముఖ్యతను వివరించిన దర్గా నిర్వాహకులు ప్రసాదాలను అందజేశారు.కాగా ప్రముఖ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ కూడా దర్గాలో ప్రార్థనలు చేశారు. దర్గా నిర్వాహకులు సయ్యద్ అహ్మద్, బాబా ఫరీద్, దర్గా ఉరుసు కమిటీ అధ్యక్షులు ఓరుగంటి నాగేశ్వరరావు, న్యాయవాదులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, కన్వీనర్ జమ్రుద్దీన్ బాదుషా, కరీముల్లా, యాకూబ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా

వైసీపీ హయాంలో వేధింపులపై ఓ ప్రిన్సిపాల్ ఆవేదన


సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

పిచ్చాటూరు, ఆగస్టు 3: రాష్ట్రంలో ఐదేళ్ళ వైసీపీ పాలన ఎంత వేధింపులమయంగా సాగిందో తెలిపే ఉదాహరణ ఇది.పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన 2020లో బదిలీపై ఇక్కడికి వచ్చారు.అప్పట్లో సత్యవేడు నియోజకవర్గ వైసీపీలో నెలకొన్న వర్గ విభేదాలు కళాశాలను కూడా చుట్టుముట్టాయి. ఈ క్రమంలో కళాశాలకు మంజూరైన అభివృద్ధి పనుల విషయంలో ఆధిపత్య పోరుతో వైసీపీ నాయకులు కళాశాల ప్రిన్సిపాల్‌ను వేధించారు.ఈ విషయాలను శనివారం కళాశాలలో జరిగిన పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం, విద్యార్థుల ఎదుట ప్రిన్సిపాల్ శ్రీధర్ వివరించారు. ఇక్కడ ఉద్యోగం చేయడం కన్నా అడుక్కుతిని బతకొచ్చనిపించిందంటూ ఆవేదన వెళ్ళగక్కారు. అప్పట్లో వైసీపీ నాయకుల వేధింపులను భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, కుటుంబ సభ్యులిచ్చిన ధైర్యంతో ఆ ఆలోచనను విరమించుకున్నానని బహిరంగంగా చెప్పడం చర్చనీయాంశమైంది.ఇంకా మూడేళ్ల సర్వీసున్నా 10 నెలల క్రితం వలంటరీ రిటైర్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు.ఈ నెలలోనే రిటైర్‌మెంట్ తీసుకోనున్నట్లు తెలిపారు.మంత్రి లోకేష్ విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదుగురు సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు డీఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు తిరుపతి క్రైం స్టేషన్‌లో పనిచేస్తున్న రామకృష్ణను అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. శ్రీసిటీలో పనిచేస్తున్న చిన్న పెద్దయ్యను అన్నమయ్య జిల్లా క్రైం స్టేషన్‌కు, తిరుమల సీసీఎస్‌లో పనిచేస్తున్న రెడ్డి శేఖర్ రెడ్డిని కలికిరికి, తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న చాంద్ బాషాను మదనపల్లె వన్‌టౌన్‌కు, పాకాలలో పనిచేస్తున్న రాజగోపాల్‌ను బద్వేలుకు బదిలీ చేశారు.

యామినీ కృష్ణమూర్తి మృతికి టీటీడీ సంతాపం

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): భరతనాట్య, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాల్లో నిష్ణాతురాలు, పద్మవిభూషణ్ యామినీ కృష్ణమూర్తి మృతి పట్ల టీటీడీ అధికారులు, ఉద్యోగులు, కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.ప్రస్తుత అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె ప్రాంతానికి చెందిన యామినీ కృష్ణమూర్తి 1976-77 మధ్య టీటీడీ ఆస్థాన నర్తకిగా సేవలందించారు. ఉత్సవాలు, ముఖ్యమైన పర్వదినాల్లో శ్రీవారికి నృత్యార్చన చేసి భక్తులను ఆకట్టుకున్నారు.



భోజనంలో బొద్దింక

చంద్రగిరి, ఆగస్టు 3: చంద్రగిరి పట్టణంలోని పవిత్ర హోటల్లో సురేష్ అనే వ్యక్తి భోంచేస్తుండగా బొద్దింక కన్పించింది. దీంతో హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి నాణ్యమైన భోజనం అందేలా చూడాలని ఆయన కోరారు.

భక్తులను హడలెత్తించిన నాగుపాము




అలిపిరి నడక మార్గంలో శనివారం ఓ నాగు పాము భక్తులను హడలెత్తించింది. నడక మార్గంలోని 2,700వ మెట్టు వద్దకు వచ్చిన సుమారు ఆరడుగుల పొడవు కలిగిన పామును గుర్తించిన భక్తులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. వెంటనే దగ్గర్లోనే భద్రతా సిబ్బంది పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం ఆ పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ



తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని లైలావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రే నాయక్ స్వాగతం పలికారు. అలాగే రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కూడా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. ఈక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


గజల్ శ్రీనివాస్

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సింధూరి రెడ్డి, బండారు శ్రావణి, గాయకుడు గజల్ శ్రీనివాస్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష


తల్లి పాల గురించి అవగాహన కల్పిస్తున్న భారతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 3: తల్లి పాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఎర్రావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు శనివారం అవగాహన సమావేశం జరిగింది. ఆధునిక జీవన శైలిలో మాతృమూర్తులు తమ బిడ్డలకు ముర్రు పాలు తప్పక పట్టించాలని సూచించారు. తల్లి పాలు తాగించడం వల్ల జీవితాంతం బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగరాజమ్మ, రెడ్డిరాణి, రాజేశ్వరి, ఆరోగ్య శాఖ సిబ్బంది క్రిష్ణమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేట: ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు. భాకరాపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ వసంత కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త మంగమ్మ, ఆశా కార్యకర్తలు హంస, మునెమ్మ, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: చంటిబిడ్డకు తల్లిపాలే ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. మండలంలోని అనిచెరువు, పరమాల, తిమ్మరాజుపల్లి గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. బాలింతలు, గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు కీర్తన, మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉషారాణి, రేణుక పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ


మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఈవో

పాకాల, ఆగస్టు 3: మండలంలోని రవణయ్యగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి శనివారం విద్యాసామగ్రి అందజేశారు. 45 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో పాటు మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బాబ్జీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం హర్షణీయమన్నారు. దాతల సాయాన్ని వినియోగించుకొని విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. ఎంఈవో2 లింగయ్య, హెచ్ఎం యువరాజు, ఉపాధ్యాయులు మధు, వెంకటస్వామి, వెంకటాచలం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎర్రావారిపాలెం మండల మీట్

ఎర్రావారిపాలెం, ఆగస్టు 3: ఎర్రావారిపాలెం మండల సర్వ సభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా జరుగనున్న సమావేశం కావడంతో పులివర్తి నాని శాసనసభ్యుడి హోదాలో హాజరు కానున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకం పనులు వైసీపీ నాయకులు చెప్పినట్లే ఏకపక్షంగా జరగడంతో భారీగా అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇటీవల జరిగిన ఈజీఎస్ సోషల్ ఆడిట్ ఎటూ తేలక రీ ఆడిట్‌కు డ్వామా పీడీ ఆదేశించడంపై చర్చ జరిగే అవకాశం ఉంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీపీ శివలక్ష్మితో సెలవు పెట్టించి అగ్రకులానికి చెందిన ఎంపీటీసీ రెడ్డెమ్మకు ఇన్‌చార్జి ఎంపీపీ పదవి కట్టపెట్టడంపై కూడా చర్చించే అవకాశం ఉంది. మండలంలో విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. వీటితో పాటు హార్టికల్చర్ కార్యాలయం తదితర అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. ఈసమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

డాక్టరేట్ ప్రదానం


కిరణ్‌కుమార్

తిరుపతి రూరల్, ఆగస్టు 3: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె పంచాయతీలో ఎస్వీనగర్‌కి చెందిన జి.కిరణ్‌కుమార్‌కి తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు టెక్నాలజీ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ (విట్) డాక్టరేట్‌ని ప్రదానం చేసింది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ ఇలంగోవన్ దేవరాజ్ పర్యవేక్షణలో డిజైన్ ఆఫ్ ఎల్ఎల్‌సీ రెసోనెంట్ కన్వర్టర్ యూసింగ్ టైమ్ డొమైన్ అనాలిసిస్ ఫర్ ఈవీ అప్లికేషన్స్ విత్ ఫాల్ట్-డయాగ్నోసిస్ అండ్ ఫాల్ట్ టొలెరెంట్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈయన్ను పలువురు అభినందించారు.

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు



తిరుపతి రూరల్, ఆగస్టు 3: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) ఆర్థిక సౌజన్యంతో ఐదురోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈసదస్సులో భాగంగా జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులు-నివారణ, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా వ్యాప్తి- నివారణపై అవగాహన తరగతులు నిర్వహించారు. పలువురు వక్తలు హాజరై జూనోటిక్ వ్యాధుల నివారణకు అవలంబించాల్సిన పద్ధతులను విశదీకరించారు. ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన వెటర్నరీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, ఏడీ డాక్టర్ జగపతిరామయ్యలతో సదస్సు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీదేవి కలసి సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ

ఆదాయం రూ.3.92 కోట్లు

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.92 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 62,540 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,241 మంది తలనీలాలు సమర్పించారు.

సెక్స్ వర్కర్లపై వివక్ష చూపకూడదు

● తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్



మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యకాంత్ కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3: 'సెక్స్ వర్కర్లపై వివక్ష చూపకూడదు. వారిని సమాజంలో ప్రతి ఒక్కరూ సహృదయంతో చూడాలి' అని తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్ అన్నారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో శనివారం శ్రీశక్తి సంఘం, వివిధ సంస్థలతో కలసి విన్స్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన బుద్దదేవ్ కర్మాకర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ జడ్జిమెంటుపై న్యాయఅవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి మాట్లాడుతూ.. జీరో ఎఫ్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. సెక్స్ వర్కర్లు ఎక్కడైనా అన్యాయానికి గురైనప్పుడు వారికి అవసరమైన న్యాయ సేవలు ఉచితంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తుందని చెప్పారు. అదనపు ఎస్పీ విమలకుమారి మాట్లాడుతూ సెక్స్ వర్కర్ల పట్ల పోలీసులు బాధ్యతతో వ్యవహరిస్తున్నారని చెప్పారు. సమస్యలు ఎదురైతే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. విన్స్ సంస్థ పనితీరును గుర్తుచేస్తూ డైరెక్టర్ మీరా రాఘవేంద్రను అభినందించారు. మీరా రాఘవేంద్ర మాట్లాడుతూ.. సెక్స్ వర్కర్లు ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యంగా అన్ని హక్కులు సమానంగా పొందాలన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంటులో సెక్స్ వర్కర్లకు సంబంధించిన హక్కులు వున్నాయన్నారు. శ్రీశక్తి సంఘం తరఫున కల్పన మాట్లాడుతూ సెక్స్ వర్కర్లు సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. సీనియర్ న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్, హైకోర్టు న్యాయవాదులు, పోలీసు అధికారులు, విన్స్ సంస్థ మహిళలు పాల్గొన్నారు.

కోటికిపైగా విలువైన ఎర్రచందనం స్వాధీనం

● రెండు వాహనాల సీజ్, ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

మంగళం, ఆగస్టు 3: సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఫారెస్టు డివిజన్‌లో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి కోటికిపైగా విలువైన 84 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలతోపాటు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వివరాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మీడియాకు తెలిపారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి సత్యసాయి జిల్లా చెన్నై కొత్తపల్లి మండలం పుట్టపర్తి అటవీ డివిజన్‌లో తనిఖీలు నిర్వహించారు. దామాజీపల్లి వద్ద హైదరాబాదు- బెంగళూరు రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా అటువైపు ఓ కారు రావడం గమనించి ఆపేందుకు ప్రయత్నించారు. వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. దీని వెనుకే ఓ లగేజీ వాహనం కూడా అతివేగంగా వెళ్లిపోవడంతో అధికారులు రెండు వాహనాలను వెంబడించి చుట్టుముట్టారు. వాహనాలను వదలి అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన షేక్ హుస్సేన్(24), మల్లెల గ్రామం పంచాయతీ, తొండూరు మండలానికి కాసెట్టి మల్లికార్జున(37)ను పట్టుకున్నారు. లగేజీ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 84 ఎర్రచందనం దుంగలు ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఇద్దరు స్మగ్లర్లను విచారించగా, కడప జిల్లాకు చెందిన పాత స్మగ్లర్ల ప్రమేయం ఇందులో ఉన్నట్లుగా తేలిందని సుబ్బరాయుడు తెలిపారు. గతంలో స్మగ్లింగ్‌లో కేసులు నమోదై, ఇపుడు పట్టుబడ్డవారిపై పీడీ యాక్టు కూడా నమోదు చేస్తామన్నారు. స్వాధీనం చేసుకున్న దుంగలు, రెండు వాహనాలు కలిపి రూ.1.50 కోటి ఉంటుందని చెప్పారు. పట్టుబడ్డ ఎర్రచందనాన్ని, వాహనాలను తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడ్డ స్మగ్లర్లు, దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

బీసీలకూ వర్గీకరణ చేపట్టాలి

● అత్యంత వెనుకబడిన తరగతుల సమాఖ్య

తిరుపతి (జీవకోన), ఆగస్టు 3: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన తరగతుల(ఎంబీసీ) వెనుకబాటుతనం ఆధారంగా బీసీల వర్గీకరణ చేపట్టాలని అత్యంత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనుకొండ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. గతంలో చంద్రబాబు తీసుకున్న చొరవతోనే నేడు వర్గీకరణ సాధ్యమైందని అన్నారు. వర్గీకరణ కోసం పోరాటాలు చేసిన మందకృష్ణ మాదిగను, ఆ సామాజిక వర్గాన్ని అభినందిస్తున్నామన్నారు. ఇక రాష్ట్రంలో రిజర్వేషన్ ఫలాలు అందక ఎంబీసీలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. రాష్ట్రంలో బీసీల వర్గీకరణ చంద్రబాబు సాధ్యం చేయగలరన్న విశ్వాసం తమకు ఉందన్నారు. త్వరలోనే అన్ని జిల్లాల సంఘాలతో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో భర్తీ చేయబోవు నామినేటెడ్ పదవుల్లో కూడా ఎంబీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో గజేంద్ర వాల్మీకి, జ్ఞానశేఖర్ ముదిరాజ్, కోదండరెడ్డి, ధర్మాచారి, రాజేంద్రప్రసాద్ గాండ్ల, గజేంద్ర, గంగులప్ప, విజయకుమార్ ఉత్తరాది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఇనుకొండ సుబ్రహ్మణ్యం

కేంద్రమంత్రికి సాదర స్వాగతం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 3: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు తిరుపతిలో బీజేపీ నాయకులు సాదర స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం ఆయన తిరుపతికి రాగా, అలిపిరి గరుడ సర్కిల్ వద్ద సత్కరించారు. బీజేపీ నాయకులు జల్లి మధుసూదన్, నాగోతు రమేష్ నాయుడు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్య యాదవ్, కట్టమంచి చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'హక్కుల అమలు'పై జాతీయ సదస్సుకు తోడ్పాటు

జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్


విజయభారతిని సన్మానిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3: హక్కుల అమలు ప్రాముఖ్యతపై ఎస్వీయూనివర్సిటీలో నిర్వహించే జాతీయ సదస్సు నిర్వహణకు తోడ్పాటు అందిస్తామని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి తెలిపారు. ఎస్వీయూను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడితో చర్చించారు. వర్సిటీలో బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాలకు తోడ్పడాలని యూనివర్సిటీ అధికారులు కోరారు. స్పందించిన ఆమె.. హ్యూమన్ రైట్స్ విభాగంలో నిర్వహించనున్న సదస్సుకు ప్రతిపాదనలు పంపితే రూ.6 లక్షలు నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు. వర్సిటీ హ్యూమన్ రైట్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ గట్టు రంజిత్ కుమార్, సామాజిక కార్యకర్త డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చదువు కొనసాగించండి

ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్

తిరుపతి(విద్య), ఆగస్టు 3: చదువు మధ్యలో ఆపేసిన వారు మళ్లీ కొనసాగించండని ప్రభుత్వ పరీక్షల సహాయ సంచాలకుడు, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామిరెడ్డి పిలుపునిచ్చారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించి ఓరియంటేషన్ కార్యక్రమం తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్ విద్యార్థికి ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయని ఆరో సబ్జెక్ట్‌ను ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చన్నారు. నచ్చిన మాధ్యమంలో పరీక్ష రాయవచ్చని వివరించారు. వృత్తివిద్య కోర్సులు కూడా ఉంటాయని, అన్ని పుస్తకాలను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. ఇకనుంచి ధ్రువీకరణ పత్రాలన్నింటినీ డిజిలాకర్‌లో ఉంచనున్నట్టు తెలియజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖాధికారి భాస్కర్‌నాయక్, రూరల్ ఏంఈవో దేవరాజులు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో సమన్వయకర్తలు, విద్యాశాఖాధికారులు

పెద్దిరెడ్డికి ఊచలు లెక్కపెట్టే సమయం దగ్గరపడింది

● మంత్రి రాంప్రసాద్ రెడ్డి



చిత్తూరు రూరల్, ఆగస్టు 3 : 'పెద్ద రెడ్డో...చిన్న రెడ్డో ప్రజలకు అన్యాయం చేసిన ఎవరైనా ఊచలు లెక్క పెట్టాల్సిందే. అదే మాదిరిగానే పెద్దిరెడ్డి తాను చేసిన పాపాలకు ఊచలు లెక్కపెట్టే సమయం దగ్గర పడింది' అని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. ఈ నెల 5వ తేదీన పుంగనూరు పర్యటనలో ఆయన పాపాలను వెలికితీస్తానని చెప్పారు.శనివారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన 17 నూతన బస్సులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పుంగనూరు పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోనున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అతి త్వరలో అమలు చేస్తామని తెలిపారు. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. ఒక్క బస్సు కూడా కొనలేకపోయిందని తెలిపారు. చంద్రబాబు సీఎం అయ్యాక 1,400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, అందులో 400 రోడ్లపై తిరుగుతున్నాయని చెప్పారు. రానున్న ఐదేళ్లలో రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతాయన్నారు. ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ శ్రీనివాసులు, టీడీపీ నేతలు సీఆర్ రాజన్, దొరబాబు, సీకే బాబు,చల్లా బాబు, ఆర్ఎం జితేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

చంద్రగిరి, ఆగస్టు 3: కొత్తపేటలోని షైనీ బ్యూటీ పార్లర్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకురాలు సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. నవ భారత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో జన్ శిక్షణ్ సంస్థాన్ సహకారంతో బ్యూటీపార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్నవారికి మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ భారత ప్రభుత్వం సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 63000 25145 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆరోగ్య సమస్యలు తొలి దశలోనే గుర్తించాలి: ఎస్పీ


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3: ఆరోగ్య సమస్యలు తొలి దశలోనే గుర్తించి, నివారణ కోసం వైద్యులను సంప్రదించాలని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం టాటా ట్రస్టు క్యాన్సర్ ఫ్రీ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక పోలీసు మైదానంలో క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు కుటుంబ సభ్యులందరూ ఇలాంటి మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు ఎస్పీ విమలకుమారి, అదనపు ఎస్పీ వెంకట్రావు, పోలీసు యూనిట్ డాక్టర్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో మానవహక్కులను కాపాడండి!

ఎన్‌హెచ్ఆర్సీ చైర్‌పర్సన్‌కు చెవిరెడ్డి వినతి

తిరుపతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో మానవ హక్కులను కాపాడాలని ఆ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం తిరుపతిలో ఆమెను కలసిన చెవిరెడ్డి.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడులకు పాల్పడుతున్నారని, అధికార పార్టీ ఆగడాలకు కొందరు ప్రభుత్వ అధికారులు కూడా సహకరిస్తున్నందున పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

ఎన్ఎస్‌యూ వీసీకి రాష్ట్రపతి కార్యాలయ ఆహ్వానం



వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, ఆగస్టు 3: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న సాయంత్రం 6గంటలకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరుకావాలని తిరుపతికి చెందిన జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తికి రాష్ట్రపతి కార్యాలయంనుంచి ఆహ్వానం అందిందని వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందని వీసీ పేర్కొన్నారు.

రాజధానికి జీవన్‌కుమార్ రూ.25వేల విరాళం



తిరుపతి రూరల్, ఆగస్టు 3: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెకి చెందిన దివ్యాంగుడు కె.జీవన్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి తనవంతుగా రూ.25వేల విరాళం అందజేశారు. మంగళగిరిలోని రాష్ట్ర టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం సీఎం చంద్రబాబును కలసి నగదు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా జీవన్‌కుమార్‌ని సీఎం అభినందించారు. రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావాలని, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపొందాలని కోరుతూ జీవన్‌కుమార్ గతంలో 16వారాలు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం గమనార్హం.

వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఊరేగింపు



రామచంద్రాపురం, ఆగస్టు 3: రామాపురం మహాభారత ఉత్సవాలకు నాందిగా కమ్మపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. ఈ నెల8వ తేదీ ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమై 25వ తేదీ అగ్నిగుండ ప్రవేశంతో ముగుస్తాయి. 20వ తేదీ ద్రౌపదీ కల్యాణం, 23న అర్జున తపస్సు, 24న అలుగోత్సవం, 26న పుష్పయాగం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఎస్వీయూ అధికారులను కలిసిన ఎమ్మెల్యే నాని



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఆగస్టు 3: ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం కలిశారు. యూనివర్సిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. యూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని వీసీ, రిజిస్ట్రార్ తెలిపారు.

టీటీడీ అదనపు ఈవోను కలిసిన చంద్రగిరి ఎమ్మెల్యే

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకయ్య చౌదరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వివిధ అంశాలపై కొద్ది సమయం చర్చించారు.

బోధనేతర ఉద్యోగుల సమస్య పరిష్కరించండి

తిరుపతిరూరల్, ఆగస్టు 3: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం సాయంత్రం వీసీ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో పనిచేసే ముగ్గురు బోధనేతర ఉద్యోగులకు సంబంధించిన న్యాయపరమైన సమస్యని పరిష్కరించి వారికి తగు న్యాయం చేయాలని వీసీతో మాట్లాడారు. వెటర్నరీ కళాశాలలో దాదాపు ఐదుసంవత్సరాల క్రితం ఓ మహిళకు సంబంధించిన విషయంలో అటెండర్ కె.మహేంద్రయ్యకు ఎటువంటి సంబంధం లేదని పోలీసులు క్లియరెన్స్ ఇచ్చారని, అయినా ఆ ఉద్యోగికి మూడు ఇంక్రిమెంట్లు కట్ చేయడంతోపాటు ఏడాదిపాటు(అర్ధజీతం) జీతం ఇవ్వలేదని వీసీకి వివరించారు. చార్జిషీటులో మహేంద్రయ్య పేరులేకున్నా పనిష్‌మెంట్ ఎలా ఇస్తారని వీసీని అడిగారు. దీనిపై విచారించి అర్ధజీతంతోపాటు మూడు ఇంక్రిమెంట్లు రిలీజ్ చేసేలా చర్యలు చేపట్టాలని వీసీని కోరారు. ఇదేవిషయంలో మరో ఇద్దరు ఉద్యోగులు(అటెండర్ శ్రీనివాసులు, రికార్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్)కూడా ఇబ్బందిపడుతున్నట్లు తనకు ఫిర్యాదు చేశారని, విచారించి వారికి కూడా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వీసీ మాట్లాడుతూ.. దీనిపై విచారించి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యేకి తెలిపారు. బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సీతారాముల దర్శనం



చంద్రగిరి, ఆగస్టు 3: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడు భక్తులకు దర్శనమిచ్చారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ సమేత హనుమంత ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా చంద్రగిరిలో వెలసిన కోదండరామాలయంలో సీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లను ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

కుప్పం, ఆగస్టు 3: కుప్పంలో ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడి కథనం మేరకు.. తిరుపతి జిల్లా భాకరా పేటకు చెందిన ఉదయ్‌కుమార్ (27) కుప్పం పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పర్సనల్ లోన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఇంకా పెళ్లికాలేదు. ఇతడు వజ్రవేలుశెట్టి వీధిలోని శ్రీసాయి ప్లాజాలోని మూడవ అంతస్తుల్లో నివాసం ఉంటున్నాడు. శనివారం విధులకు వెళ్లలేదు. సహచర ఉద్యోగులు ఇంటి వద్దకు వచ్చారు. ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో అనుమానంతో తలుపులు బద్దలు కొట్టి చూశారు. ఉదయ్‌కుమార్ ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో ప్రజాదర్బార్



బాధితుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యాక్రమాన్ని అధ్యక్షుడు నరసింహ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వారి సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రజాదర్బార్‌లో చెప్పుకోవచ్చన్నారు. సమస్యలను పరిష్కరించేలా పార్టీకి, ప్రభుత్వానికి వారధిగా ప్రజా దర్బార్ ఉంటుందన్నారు. ప్రతి శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు చేజెర్ల మనోహరాచారి, యశ్వంత్ రెడ్డి, రవిశంకర్ యాదవ్, మురళి, సురేష్, పెంచలయ్య, చెంగయ్య, ఆవుల శ్రీనివాసుల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లోకి అవయవదానం మిన్న



అవయవదానం ప్రాముఖ్యాన్ని వివరిస్తున్న టీటీడీ జేఈవో గౌతమి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 3: అన్నిదానాల్లోకి అవయవదానం గొప్పదని టీటీడీ జేఈవో గౌతమి అన్నారు. భారతీయ అవయవ దానం దినోత్సవాన్ని స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ.. వైద్యరంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులతో శరీరంలోని అన్ని అవయవాల మార్పిడి సులభతరంగా జరుగుతుందన్నారు. దీంతో ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. ఇప్పటికే స్విమ్స్‌లో కిడ్నీ మార్పిడి, శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయలో గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతుండటం గొప్ప విషయమన్నారు. అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వారితో చైతన్యం తీసుకురావాల్సి ఉందన్నారు. దీనికి విద్యార్థులు, యువత కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు అవయవదానంపై అవగాహన ర్యాలీని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ ప్రారంభించారు. వైద్యులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. శ్రీపద్మావతి హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు వెంకట్రామిరెడ్డి, హరికృష్ణ, కృష్ణసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే ప్రధానం : డీపీటీవో



డ్రైవర్లకు ప్రయాణికులతో గులాబీలు అందిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 3: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ప్రధానమని ప్రజారవాణాధికారి (డీపీటీవో) చెంగల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం అలిపిరి, తిరుపతి, మంగళం డిపోల్లో 'ఫ్రెండ్లీమీట్' కార్యక్రమం నిర్వహించారు. అందుబాటులో ఉన్న డ్రైవర్లకు ప్రయాణికులతో గులాబీ పూలను అందించి జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అలాగే ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. డిప్యూటీ సీఎంఈ నరసింహులు, సీటీఎం భాస్కర్‌రెడ్డి, డిపోల మేనేజర్లు హరిబాబు, బాలాజి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



వేదికపై ముఖ్య అతిథులు

తిరుపతి (విద్య), ఆగస్టు 3: తిరుపతిలో తొలిసారిగా గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ శనివారం జరిగింది.ఈ సమ్మిట్‌ను ఎస్వీయూ వీసీ డాక్టర్ అప్పారావు ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ నరసింహ ఆధ్వర్యంలో ప్రపంచంలోని 100 కంపెనీలకు చెందిన ప్రతినిధుల బృందం సమ్మిట్‌కు హాజరైంది. ఈ సమ్మిట్‌ను ఉద్దేశించి ఎస్వీయూ వీసీ మాట్లాడుతూ.. గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ తిరుపతిలో నిర్వహించడం ఇక్కడి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఇక్కడి విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. ముఖ్యంగా వారి తల్లిదండ్రులకు ఉన్నత చదువులపై మంచి అవగాహన కలుగుతుందని, ఉద్యోగావకాశాలకూ సాయ పడుతుందన్నారు. గతంలో విద్యార్థులు ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లి దిక్కుతోచని స్థితిలో పెట్రోలు బంకులు, హోటళ్లలో పనిచేసే దుస్థితి ఏర్పడుతున్న నేపథ్యంలో ఐసీసీ డైరెక్టర్ నరసింహ ఆధ్వర్యంలో ఇలాంటి సమావేశాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, ఐటీ కంపెనీ సీఈవో వంశీరాయల్, అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ఇండియా కో-ఆర్డినేటర్ సూర్యచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



రాస్ కార్యాలయంలో చిరుధాన్యాల ప్రదర్శన

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 3: సేంద్రియ ఎరువులతో పండించిన చిరుధాన్యాలు, కూరగాయలు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసులు అన్నారు. రాస్ ప్రధాన కార్యాలయంలో శనివారం చిరుధాన్యాల ప్రదర్శనను ప్రారంభించారు. ఆదివారం కూడా ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా విశిష్ట వైద్యం

నెల్లూరులో మెడికల్ సెంటర్ ప్రారంభించిన డాక్టర్ రేలా



మాట్లాడుతున్న డాక్టర్ రేలా

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 3 : చెన్నై రేలా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఇక నుంచి నెల్లూరు జిల్లా ప్రజలకు విశిష్ట వైద్య చికిత్సలు అందించనున్నట్లు ఆ ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొహ్మద్ రేలా తెలిపారు. నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసిన రేలా మెడికల్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటి వరకు చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా 3వేల కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. మెర్సీ కిల్లింగ్‌కు కోర్టును ఆశ్రయించిన చిత్తూరు జిల్లాకు చెందిన 2 నెలల చిన్నారి జ్ఞానసాయికి 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారికి 8 ఏళ్ల వయసు వచ్చిందన్నారు. అలాగే పలు విభాగాల వ్యాధుల నివారణలో చెన్నై రేలా ఆసుపత్రి ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆసుపత్రి ప్రారంభోత్సవంలో చిన్నారి జ్ఞానసాయి పాల్గొని డాక్టర్ రేలాకు పుష్పగుచ్ఛం అందించింది. అనంతరం పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాస్కులర్ సర్జన్ డాక్టర్ సీఎంకే రెడ్డి, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

సీఎస్ఈ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3: ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తుకు ఈ నెల 9వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఈనెల 12వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.ఇన్.డీవోఏ.. వెబ్‌సైట్ చూడాలని వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



శ్రీదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3: పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగ పరిశోధకురాలు బి.శ్రీదేవి డాక్టరేట్ పొందారు. కర్నూలు జిల్లా స్త్రీల పాటలు-ఒక పరిశీలన అంశం పై డాక్టర్ డి.యువశ్రీ పర్యవేక్షణలో ఆమె సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఈ మేరకు వర్సిటీ పరీక్షల డీన్ జీవనజ్యోతి తెలిపారు.

వర్సిటీల్లో వైసీపీ అక్రమాలపై విచారణ చేపట్టండి

సీఎం చంద్రబాబుకు తెలుగు యువత వినతి



చంద్రబాబుతో మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని సీఎం చంద్రబాబును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ కోరారు. విజయవాడలో శనివారం సీఎంను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. స్వయానా నాటి ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అక్రమ డిప్యుటేషన్లకు తెర లేపారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎస్వీయూనివర్సిటీలో ఎన్ఎంఆర్‌ల నియామకాలు జరిగాయని ఆరోపించారు. ఈ అంశాలపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి వీసీల నియామకంలో బీసీలకు తగు న్యాయం చేసినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ హయాంలో ఎస్వీయూలో రూ.2 కోట్ల అవినీతి



రిజిస్ట్రార్‌కు విన్నవిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీయూలో రూ.2 కోట్ల మేర అవినీతి కుంభకోణం జరిగిందని బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఈ అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. పురుషోత్తం, రంజిత్, ప్రసన్న, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ ఆయుర్వేదలో 'స్పార్క్' కుర్రోళ్లు

స్టూడెంట్స్ ఫెలోషిప్‌లో మెరిసిన యువ వైద్యులు



వెంకట రాజ వంశీ, జీఎన్ గోవింద

తిరుపతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థులు స్టూడెంట్ ఫెలోషిప్‌లో మెరిశారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్), స్టూడెంట్‌షిప్ ప్రోగ్రాం ఫర్ ఆయుర్వేద రీసెర్చ్ కెన్ (స్పార్క్) జాతీయ స్థాయి పోటీల్లో ఎస్వీ ఆయుర్వేద విద్యార్థులు ప్రతిభ చాటారు. సీసీఆర్ఏఎస్ ఏటా ఆయుర్వేదంలో పరిశోధనాసక్తిని రేకెత్తించడానికి 'స్పార్క్' పేరిట స్టూడెంట్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాలలో బీఏఎంఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి మావడూరు వెంకట రాజ వంశీ (2023-24)తెలుగు రాష్ట్రాలనుంచి ఎంపికయ్యారు. ఆయుష్ విభాగం దేశవ్యాప్తంగా 194 మందిని పరిశోధనలను ఆమోదిస్తే అందులో రాజవంశీ నిలవడంతో రూ.50వేల నగదు బహుమతి అందజేయనుంది. అదేవిధంగా 'పీజీ-స్టార్' ప్రోగ్రాంలో ఎస్వీ ఆయుర్వేద కళాశాల పీజీ విద్యార్థి డాక్టర్ జీఎన్ గోవింద ఎంపికయ్యారు. వీరు రూ.లక్ష పారితోషికాన్ని అందుకోనున్నారు. కాగా స్పార్క్‌లో మెరిసిన యువ వైద్యవిద్యార్థులకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ వేదికగా శనివారం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, ఇతర వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎస్వీయూ రీసెర్చ్ డీన్‌గా నరసింహ



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న నరసింహ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3: ఎస్వీయూ రీసెర్చ్ డీన్‌గా వైరాలజీ ప్రొఫెసర్ జి.నరసింహ నియమితులయ్యారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు చేతుల మీదుగా ఆయన శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఎస్వీయూలో ఎమ్మెస్సీ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2007లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరారు. 7 పుస్తకాలు, 120కి పైగా పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. మూడు పరిశోధనా ప్రాజెక్టులు చేశారు. గ్రీసు దేశంలో ఏజెన్స్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో విజిటింగ్ ఫ్యాకల్టీగా పని చేశారు. కొన్ని జర్నల్స్‌లో ఎడిటోరియల్ బోర్డు మెంబర్‌గా పనిచేస్తున్నారు. కేరళలోని కొట్టాయం యూనివర్సిటీనుంచి 2014లో యంగ్ ఫ్యాకల్టీ అవార్డు స్వీకరించారు.

పులికాట్ పూడికతీతకు చర్యలు చేపట్టండి : కలెక్టరు



పులికాట్ పూడికతీతపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి(విద్య), ఆగస్టు 3: పులికాట్ సరస్సు ముఖద్వారం వద్ద పూడిక తీసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో టూరిజం, మత్స్య, అటవీ శాఖాధికారులతో సమావేశమయ్యారు. పులికాట్ పూడికతీత, నేలపట్టు పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. పూడికతీతతో మత్స్యకార కుటుంబాలకు ఉపాధి, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. సముద్రపు నీరు సరస్సులోకి రావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. సరస్సులో ఎల్లప్పుడూ నీరు ఉంటే ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉన్న పులికాట్, నేలపట్టు పక్షుల అభయారణ్యం మెరుగవుతాయని వివరించారు. దీనివల్ల పలురకాల పక్షులు వస్తాయని, తద్వారా సందర్శకులు పెరిగి పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే పులికాట్ పరిసర గ్రామాల ప్రజలకు రహదారి, మౌలిక సదుపాయాల కల్పనపైనా సమీక్షించారు. మత్స్య, అటవీశాఖ అధికారులు స్పందిస్తూ.. పులికాట్ ముఖద్వారం వద్ద పూడికతీతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా నిధులు సమకూర్చే విధంగా రూ.97.09కోట్లకు సాగరమాల పథకం కింద అనుమతులు వచ్చాయన్నారు. అయితే నిధులు ఇంకా విడుదల కాలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వో శామ్యూల్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస క్రీడా సముదాయంలో యోగా శిక్షణ

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3: శ్రీనివాస క్రీడా సముదాయంలో రోజూ ఉదయం, సాయంత్రం యోగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 99853 94350 నెంబరును సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన మహిళా వర్సిటీ వీసీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేని అధికారులు కోరగా, అందుకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని తదితరులు పాల్గొన్నారు.

44వ వార్డులో నీటి కష్టాలు

తిరుపతి(మధురానగర్), ఆగస్టు 3: నగరంలోని 44వ వార్డులో నీటి సరఫరా సరిగా జరగడం లేదు. ఈ వార్డు పరిధిలోని రైల్వేకాలనీ, మధురానగర్, సప్తగిరినగర్‌లో మూడ్రోజులుగా పూర్తిగా నీటి సరఫరా ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు శనివారం నీటిని కొద్ది సమయంపాటే వదిలారు. అవి కూడా ఫోర్స్‌గా రాకపోవడంతో స్థానికులకు నీటి కష్టాలు తప్పలేదు. దీనిపై మున్సిపల్ ఈఈ వెంకట్రామిరెడ్డిని వివరణ కోరగా.. రామాపురం వద్ద పైపులైన్ల మరమ్మతుల కారణంగా నీటి సరఫరాలో ఇబ్బందులు వచ్చాయన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వండి

సీఎం చంద్రబాబును కలిసిన తిరుపతి టీడీపీ నేతలు



చంద్రబాబును కలిసిన కంకణాల రజనీకాంత్, ఓవీ రమణ, మహేష్ యాదవ్, పాటకం వెంకటేష్

తిరుపతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో తమకు ప్రాధాన్యమివ్వాలని సీఎం చంద్రబాబును తిరుపతి టీడీపీ నేతలు కోరారు. శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో పలువురు నేతలు వేర్వేరుగా కలిసి వినతులను సమర్పించారు. సీఎంను కలిసిన టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు ఓవీ రమణ మాట్లాడుతూ.. కాపు సామాజికవర్గంలో చైతన్యం తీసుకొచ్చానని చెప్పారు. మలేషియా నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారంటూ దానికి సంబంధించిన వివరాలను బాబుకు అందించారు. అలాగే తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలకుపైగా పార్టీ కోసం పనిచేశానని, తన శ్రమను గుర్తించి పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వగలరని కోరారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టుకు రూ.5వేలు అందిస్తూ.. మిమ్మల్ని కలిసేందుకు వచ్చేవారు బొకేలు, శాలువాలతో కాకుండా వారి స్థాయికి తగ్గట్టు అమరావతి నిర్మాణానికో, ఎన్టీఆర్ ట్రస్ట్, లేదా అన్న క్యాంటీన్ల కోసం విరాళాలు ఇస్తే బాగుంటుందని చంద్రబాబు వద్ద ప్రస్తావించారు. మంచి ఆలోచన అని, అమలు చేస్తామని రజనీని బాబు అభినందించారు. నగర పార్టీ ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ కూడా సీఎంను కలిసి తిరుపతి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులను వివరించారు. మరో టీడీపీ నేత పాటకం వెంకటేష్ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని చంద్రబాబును కలిసి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

కార్మికులపై కక్ష సాధింపులు మానుకోండి: సీపీఐ



రవిప్రభుకు విషయం తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 3: 'రుయాస్పత్రిని శుభ్రంగా ఉంచడంలో ప్రధాన పాత్ర వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై ఏజెన్సీ నిర్వాహకులు కక్ష సాధింపులు మానుకోవాలి' అని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ సూచించారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు రుయా పరిపాలనా భవనం ముందు శనివారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని, 226 మందితో చేయించాల్సిన పనులను కేవలం 90మందితోనే చేయిస్తున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి చెల్లించకుండా నెలకు రూ.17లక్షలకుపైగా కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాలపై ప్రశ్నించిన కార్మికులను విధుల్లో నుంచి తొలగించడం లేదా కక్ష సాధింపులకు దిగడం వంటివి చేస్తున్నారని మండిపడ్డారు. పలుమార్లు రుయా అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదని విమర్శించారు. ఇకనైనా సమస్యలను పరిష్కరించకుంటే కార్మికులు సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. స్పందించిన సూపరింటెండెంట్ రవిప్రభు కార్మికుల వద్దకొచ్చి వివరాలు తెలుసుకున్నారు. సమస్యలను రెండ్రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్టా మహేంద్ర, నేతలు రవి, పెంచలయ్య, విశ్వనాథ్, రాజాబాబు, కిశోర్, మీనా, ప్రమీల, పార్వతి, రూప, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మారుతీ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), ఆగస్టు 3: తమ ఆస్పత్రిలో ఓ వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించామని శ్రీమారుతీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారుతీ కృష్ణ వెల్లడించారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఆస్పత్రిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓ వృద్ధురాలు (65) కొంతకాలంగా దగ్గుతో రక్తస్రావం అవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడ చూపించినా తగ్గక పోవడంతో ఆమె కుటుంబీకులు తమవద్దకు తీసుకొచ్చారని చెప్పారు. ఇంటర్నేషనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎంపీ నరసింహ పరీక్షించి.. సమస్యను గుర్తించారన్నారు. తమ వద్ద అత్యాధునిక వైద్యపరికరాలు ఉండటంతో క్లిష్టమైన బ్రాంకో ఎంబోలైజేషన్ అడ్వాన్స్ పద్ధతిలో రక్తస్రావాన్ని అదుపుచేసి అరుదైన శస్త్ర చికిత్స చేసి వృద్ధురాలి ప్రాణాలు నిలబెట్టామన్నారు. ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రేడియాలజిస్టు నవీన్ ఆధ్వర్యంలో కోత, కుట్లు లేకుండా శస్త్రచికిత్స చేశారని వివరించారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 3: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోనిఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద విద్యార్థులకు యూనిఫాం, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కూడా ఇదే కళాశాలలో చదువుకున్నానన్నారు. తాను విద్యావంతుడిని కాబట్టే 1994లో మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా టీడీపీ అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జిలానీబాషా, సీఐ రవికిరణ్, చెంచురామయ్య, శ్రీపతిబాబు, భుజగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ క్యాంపు కార్యాలయంలో తమ్మినపట్నానికి చెందిన ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సర విద్యార్థి క్రాంతికిరణ్ ఫీజును చెల్లించేందుకు జిందాల్ కంపెనీ ముందుకు వచ్చి రూ.1.20 లక్షలను అందించిందన్నారు. ఆ చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లలో ప్రభుత్వ స్థలాలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వీటిపై విచారణ జరిపి స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

పేద విద్యార్థుల చదువుకు నగదు అందజేత



చిట్టమూరు, ఆగస్టు 3: మండలంలోని కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో టెన్త్ చదువుతున్న ఇద్దరు విద్యార్థుల చదువుల కోసం నగదు అందజేశారు. బయ్యావారికండ్రిగకు చెందిన ఓ.శ్రీనివాసులు కుమార్తె మోనిష పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్ కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చిల్లకూరు, ఆగస్టు 3: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం రొటేరియన్ చల్లా రాంకుమార్ దాతృత్వంతో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, రవీంద్రరెడ్డి, బలరామిరెడ్డి, హెచ్‌ఎం సుధాకర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



వెంకటగిరిటౌన్, ఆగస్టు 3: పట్టణంలోని 21 వార్డులో ఆర్డీఓ కిరణ్ కుమార్ శనివారం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోనికా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మౌనికా రెడ్డి మాట్లాడుతూ... పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొవిడ్‌లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందించామన్నారు. విద్యార్థులకు కంప్యూటర్లు, వృద్ధులకు పెన్షన్, గర్భిణులకు పౌష్టికాహారం అందించామన్నారు. మున్సిపల్ కమిషనర్ రషీద్, ఎంపీడీవో నీల కంఠేశ్వరరెడ్డి, సీఐ సంగమేశ్వరావు, డీటీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ అన్నదానం ట్రస్టు ఏర్పాటు చేయండి



వెంకటగిరి టౌన్, ఆగస్టు 3: ప్రసిద్ధి గాంచిన వెంకటగిరి పోలేరమ్మ జాతర పేరుతో నిత్య అన్నదానం ట్రస్ట్ ఏర్పాటుకు కృషి చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని వెంటకగిరి పట్టణానికి చెందిన ప్రకృతి కుమార్ కోరారు. శనివారం మంత్రిని నెల్లూరు నగరంలోని ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు వెంకటగిరిలో పోలేరమ్మ ఆస్తులను పరిశీలించి ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపీనాథ్, శ్యామ్, తోట పవన్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అదనపు ఈవోతో కురుగొండ్ల భేటీ



డక్కిలి, ఆగస్టు 3: తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో వెంకయ్య చౌదిరిని శనివారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమలకు వెళ్లిన కురుగొండ్ల అదనపు ఈవో కార్యాలయానికి వెళ్లి వెంకయ్య చౌదరికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.

సెక్స్ వర్కర్లపై వివక్ష చూపకూడదు

● తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3: 'సెక్స్ వర్కర్లపై వివక్ష చూపకూడదు. వారిని సమాజంలో ప్రతి ఒక్కరూ సహృదయంతో చూడాలి' అని తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్ అన్నారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో శనివారం శ్రీశక్తి సంఘం, వివిధ సంస్థలతో కలసి విన్స్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన బుద్దదేవ్ కర్మాకర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ జడ్జిమెంటుపై న్యాయఅవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి మాట్లాడుతూ.. జీరో ఎఫ్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. సెక్స్ వర్కర్లు ఎక్కడైనా అన్యాయానికి గురైనప్పుడు వారికి అవసరమైన న్యాయ సేవలు ఉచితంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తుందని చెప్పారు. అదనపు ఎస్పీ విమలకుమారి మాట్లాడుతూ సెక్స్ వర్కర్ల పట్ల పోలీసులు బాధ్యతతో వ్యవహరిస్తున్నారని చెప్పారు. సమస్యలు ఎదురైతే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. విన్స్ సంస్థ పనితీరును గుర్తుచేస్తూ డైరెక్టర్ మీరా రాఘవేంద్రను అభినందించారు. మీరా రాఘవేంద్ర మాట్లాడుతూ.. సెక్స్ వర్కర్లు ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యంగా అన్ని హక్కులు సమానంగా పొందాలన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంటులో సెక్స్ వర్కర్లకు సంబంధించిన హక్కులు వున్నాయన్నారు. శ్రీశక్తి సంఘం తరఫున కల్పన మాట్లాడుతూ సెక్స్ వర్కర్లు సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. సీనియర్ న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్, హైకోర్టు న్యాయవాదులు, పోలీసు అధికారులు, విన్స్ సంస్థ మహిళలు పాల్గొన్నారు.



పులికాట్ పూడికతీతకు చర్యలు చేపట్టండి

మత్స్యకారులకు ఉపాధితో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది: కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 3: పులికాట్ సరస్సు ముఖద్వారం వద్ద పూడిక తీసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో టూరిజం, మత్స్య, అటవీ శాఖాధికారులతో సమావేశమయ్యారు. పులికాట్ పూడికతీత, నేలపట్టు పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. పూడికతీతతో మత్స్యకార కుటుంబాలకు ఉపాధి, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. సముద్రపు నీరు సరస్సులోకి రావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. సరస్సులో ఎల్లపుడూ నీరు ఉంటే ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉన్న పులికాట్, నేలపట్టు పక్షుల అభయారణ్యం మెరుగవుతాయని వివరించారు. దీని వల్ల పలురకాల పక్షులు వస్తాయని, తద్వారా సందర్శకులు పెరిగి పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే పులికాట్ పరిసర గ్రామాల ప్రజలకు రహదారి, మౌలిక సదుపాయాల కల్పనపైనా సమీక్షించారు. మత్స్య, అటవీశాఖ అధికారులు స్పందిస్తూ.. పులికాట్ ముఖద్వారం వద్ద పూడికతీతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా నిధులు సమకూర్చే విధంగా రూ.97.09కోట్లకు సాగరమాల పథకం కింద అనుమతులు వచ్చాయన్నారు. అయితే నిధులు ఇంకా విడుదల కాలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, వైల్డ్ లైఫ్ డీఎఫ్‌వో శామ్యూల్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




వెంకట రాజ వంశీ - జీఎన్ గోవింద

ఎస్వీ ఆయుర్వేదలో 'స్పార్క్' కుర్రాళ్లు

తిరుపతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థులు స్టూడెంట్ ఫెలోషిప్‌లో మెరిశారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్), స్టూడెంట్‌షిప్ ప్రోగ్రాం ఫర్ ఆయుర్వేద రీసెర్చ్ కెన్ (స్పార్క్) జాతీయ స్థాయి పోటీల్లో ఎస్వీ ఆయుర్వేద విద్యార్థులు ప్రతిభ చాటారు. సీసీఆర్ఏఎస్ ఏటా ఆయుర్వేదంలో పరిశోధనాసక్తిని రేకెత్తించడానికి 'స్పార్క్' పేరిట స్టూడెంట్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాలలో బీఏఎంఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి మావడూరు వెంకట రాజ వంశీ (2023-24) తెలుగు రాష్ట్రాలనుంచి ఎంపికయ్యారు. ఆయుష్ విభాగం దేశవ్యాప్తంగా 194 మందిని పరిశోధనలను ఆమోదిస్తే అందులో రాజవంశీ నిలవడంతో రూ.50వేల నగదు బహుమతి అందజేయనుంది. అదేవిధంగా 'పీజీ-స్టార్' ప్రోగ్రాంలో ఎస్వీ ఆయుర్వేద కళాశాల పీజీ విద్యార్థి డాక్టర్ జీఎన్ గోవింద ఎంపికయ్యారు. వీరు రూ.లక్ష నగదు పారితోషికాన్ని అందుకోనున్నారు. కాగా స్పార్క్‌లో మెరిసిన యువ వైద్యవిద్యార్థులకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ వేదికగా శనివారం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, ఇతర వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.



బీసీలకూ వర్గీకరణ చేపట్టాలి

ఇనుకొండ సుబ్రహ్మణ్యం

తిరుపతి (జీవకోన), ఆగస్టు 3: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన తరగతుల(ఎంబీసీ) వెనుకబాటుతనం ఆధారంగా బీసీల వర్గీకరణ చేపట్టాలని అత్యంత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనుకొండ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. గతంలో చంద్రబాబు తీసుకున్న చొరవతోనే నేడు వర్గీకరణ సాధ్యమైందని అన్నారు. వర్గీకరణ కోసం పోరాటాలు చేసిన మందకృష్ణ మాదిగను, ఆ సామాజిక వర్గాన్ని అభినందిస్తున్నామన్నారు. ఇక రాష్ట్రంలో రిజర్వేషన్ ఫలాలు అందక ఎంబీసీలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. రాష్ట్రంలో బీసీల వర్గీకరణ చంద్రబాబు సాధ్యం చేయగలరన్న విశ్వాసం తమకు ఉందన్నారు. త్వరలోనే అన్ని జిల్లాల సంఘాలతో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో భర్తీ చేయబోవు నామినేటెడ్ పదవుల్లో కూడా ఎంబీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో గజేంద్ర వాల్మీకి, జ్ఞానశేఖర్ ముదిరాజ్, కోదండ రెడ్డి, ధర్మాచారి, రాజేంద్రప్రసాద్ గాండ్ల, గజేంద్ర, గంగులప్ప, విజయకుమార్ ఉత్తరాది తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డికి ఊచలు లెక్కపెట్టే సమయం దగ్గరపడింది : మంత్రి రాంప్రసాద్ రెడ్డి



చిత్తూరు రూరల్, ఆగస్టు 3 : 'పెద్ద రెడ్డో...చిన్న రెడ్డో ప్రజలకు అన్యాయం చేసిన ఎవరైనా ఊచలు లెక్క పెట్టాల్సిందే. అదే మాదిరిగానే పెద్దిరెడ్డి తాను చేసిన పాపాలకు ఊచలు లెక్కపెట్టే సమయం దగ్గర పడింది' అని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 5వ తేదీన పుంగనూరు పర్యటనలో ఆయన పాపాలను వెలికితీస్తానని చెప్పారు.శనివారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన 17 నూతన బస్సులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పుంగనూరు పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోనున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అతి త్వరలో అమలు చేస్తామని తెలిపారు.గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. ఒక్క బస్సు కూడా కొనలేకపోయిందని తెలిపారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత 1,400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, అందులో 400 రోడ్లపై తిరుగుతున్నాయని చెప్పారు. రానున్న ఐదేళ్లలో రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతాయన్నారు. ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, టీడీపీ నేతలు సీఆర్ రాజన్, దొరబాబు, సీకే బాబు,చల్లా బాబు, ఆర్ఎం జితేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



భక్తులకు అన్నదానం

చిల్లకూరు, ఆగస్టు 3: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివార్లకు శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



కోటపోలూరులో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 3: సాగు చేసే భూములకు మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు తప్పని సరిగా చేసుకోవాలని ఆత్మ జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కోటపోలూరులో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... అధికారుల సలహా మేరకే ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జి.అనిత మాట్లాడుతూ... కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకుంటే ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తిస్తాయన్నారు. అదే విధంగా ఈ-క్రాప్ కూడా నమోదు చేసుకోవాలన్నారు. ఏవో కవిత, ఈఏఏలు హిమబిందు, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

చిల్లకూరు, ఆగస్టు 3: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని సీడీపీవో జ్యోతికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని బూదనంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించి తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించారు. నాయుడుపేట పట్టణంలోని ఎల్ఏసాగరంలోని లోతువానిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వాకాడు మండలంలోని సిద్ధిగుంటపాళెం, వాకాడు, వెంకటరెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల అవశ్యకతపై ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వెంకటగిరి అంగన్‌వాడీ అధికారిణి షంషాద్‌బేగం అన్నారు. శనివారం మండలంలోని దగ్గవోలు, ఆల్తూరుపాడుల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీలో గల వావిళ్లదొరువులో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు, వడ్డిపాలెంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో ప్రజాదర్బార్



బాధితుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహా యాదవ్ తదితరులు

తిరుపతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని అధ్యక్షుడు నరసింహ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వారి సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రజాదర్బార్‌లో చెప్పుకోవచ్చన్నారు. సమస్యలను పరిష్కరించేలా పార్టీకి, ప్రభుత్వానికి వారధిగా ప్రజా దర్బార్ ఉంటుందన్నారు. ప్రతి శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు చేజెర్ల మనోహరాచారి, యశ్వంత్ రెడ్డి, రవిశంకర్ యాదవ్, మురళి, సురేష్, పెంచలయ్య, చెంగయ్య, ఆవుల శ్రీనివాసుల యాదవ్ పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌కు ఘన నివాళి



కోట, ఆగస్టు 3: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకెఆర్ విద్యాసంస్థల్లో శనివారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 46వ వర్ధంతి శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి విగ్రహానికి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... బాలకృష్ణారెడ్డి నేటి తరాలకు ఆదర్శమన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

తడ, ఆగస్టు 3: భర్త అనుమానించాడన్న మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మండల పరిధిలోని చేనిగుంట దళితవాడలో నివాసం ఉంటున్న ఎన్.మేరి (27)కి తొమ్మిదేళ్ల క్రితం విజయ్‌తో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. వీరి స్వస్థలం తమిళనాడు పలవర్‌కాడు. ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం చేనిగుంటకు చేరుకున్నారు. అయితే భర్త పనికి సరిగా వెళ్లకపోవడంతో మేరీ వెళ్లేది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా భార్యపై అనుమానంతో గొడవపడేవాడు. శుక్రవారం గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె పురుగులమందుతాగింది. కుటుంబసభ్యులు ఆమెను నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3: మండలంలోని పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో ఓ దాబా వద్ద అనుమానస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రాజస్థాన్‌కు చెందిన పవన్‌కుమార్(45) కర్ణాటక రాష్ట్రం కోలార్ నుంచి కోల్‌కాతాకు లారీని తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పండ్లూరు వద్ద ఉన్న దాబా వద్ద లారీ ఆపి వాహనంలోనే పడుకున్నాడు. రాత్రి వరకు లేవకపోవడంతో అదే కంపెనీకి చెందిన మరో లారీ డ్రైవర్ అక్కడికి చేరుకుని పవన్‌కుమార్‌ను నిద్రలేపాడు. ఎంతసేపటికీ లేవకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పవన్‌కుమార్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా విశిష్ట వైద్యం

నెల్లూరులో మెడికల్ సెంటర్ ప్రారంభించిన డాక్టర్ రేలా



మాట్లాడుతున్న డాక్టర్ రేలా

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 3 : చెన్నై రేలా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఇక నుంచి నెల్లూరు జిల్లా ప్రజలకు విశిష్ట వైద్య చికిత్సలు అందించనున్నట్లు ఆ ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొహ్మద్ రేలా తెలిపారు. నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసిన రేలా మెడికల్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటి వరకు చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా 3వేల కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. మెర్సీ కిల్లింగ్‌కు కోర్టును ఆశ్రయించిన చిత్తూరు జిల్లాకు చెందిన 2 నెలల చిన్నారి జ్ఞానసాయికి 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారికి 8 ఏళ్ల వయసు వచ్చిందన్నారు. అలాగే పలు విభాగాల వ్యాధుల నివారణలో చెన్నై రేలా ఆసుపత్రి ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆసుపత్రి ప్రారంభోత్సవంలో చిన్నారి జ్ఞానసాయి పాల్గొని డాక్టర్ రేలాకు పుష్పగుచ్ఛం అందించింది. అనంతరం పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాస్కులర్ సర్జన్ డాక్టర్ సీఎంకే రెడ్డి, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

భక్తులను హడలెత్తించిన నాగుపాము



అలిపిరి నడక మార్గంలో శనివారం ఓ నాగుపాము భక్తులను హడలెత్తించింది. నడక మార్గంలోని 2,700వ మెట్టు వద్దకు వచ్చిన సుమారు ఆరడుగుల పొడవు కలిగిన పామును గుర్తించిన భక్తులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. వెంటనే దగ్గర్లోనే భద్రతా సిబ్బంది పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం ఆ పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

30 ఏళ్ల పోరాట ఫలితమే వర్గీకరణ



సూళ్లూరుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ సంబరాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంతో శనివారం సూళ్లూరుపేట పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్దనున్న అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వర్గీకరణకు బీజం వేసిన ఎన్డీఏ కూటమిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుక్కమల్లి రవి, మాసారం చెంగమ్మ, బుజ్జమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితమే ఎస్సీ వర్గీకరణకు సానుకూల స్పందన అని సమితి నాయకులు పెంచలయ్య, సిసింద్రి అన్నారు. శనివారం మండలంలోని సంతదాసుపల్లిలో ఎస్సీ వర్గీకరణపై ధర్మాసనం సానుకూలంగా స్పందించడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, మస్తానయ్య, మల్లికార్జున, శ్రీనివాసులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు అధికారాలు కల్పించండి

● సీఎం చంద్రబాబుకు విన్నపం



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాగేంద్రప్రసాద రెడ్డి

పెళ్లకూరు, ఆగస్టు 3: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సర్పంచులకు నిధులు, విధులు, అధికారాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి డి.నాగేంద్రప్రసాద రెడ్డి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వం సర్పంచుల అధికారాలను తగ్గించి పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన విషయం విదితమే. ఈక్రమంలో ఎన్నికల సందర్భంగా సర్పంచులకు అధికారాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చాల్సిని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్టు నాగేంద్రప్రసాద్ చెప్పారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



విద్యార్థులకు సూచనలిస్తున్న జడ్జి అనూష

డక్కిలి, ఆగస్టు 3 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వెంకటగిరి కోర్టు జడ్జి అనూష పిలుపు నిచ్చారు. శనివారం డక్కిలిలోని ఎస్‌కేఎం డిగ్రీకళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మట్లాడుతూ... మత్తు పదార్థాలు, పానీయాల సేవనంతో బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. విద్యార్థులకు ఎరవేసి వారి ద్వారా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నారని చెప్పారు. ఇంజనీరింగ్, వైద్య విద్యార్థులు సైతం వీటికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా వుండి చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, న్యాయవాది అద్దంకి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



కోట, ఆగస్టు 3: మండల పరిధిలోని గూడలి, ఊనుగుంట పాళెం స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తెల్లవారు జామున గ్రామస్తుల సహకారంతో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక నింపుకుంటున్న రెండు ట్రాక్టర్లను నది లోపలే గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



చక్రి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఆగస్టు 3: రోడ్డు ప్రమాదంలో జడపల్లి చక్రి(29) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివారులోని మిట్టకండ్రిగ వద్ద ఏపీ టూరిజం రిసార్ట్ సమీపంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు.... శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లెకు చెందిన చక్రీ ఇదే మండలం కాపుగున్నేరి వద్ద ఉన్న ఓ ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తుండేవాడు. సొంత పనుల నిమిత్తం శనివారం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా పట్టణ శివారు ఏపీ టూరిజం సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో చక్రీ ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. అదే సమయంలో తిరుపతి వైపుగా వెళుతున్న లారీ చక్రీని ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌తో సహా లారీని అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలంలో పంచనామా పూర్తిచేసి శవాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహారావు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాల దగ్ధం

శ్రీకాళహస్తి, ఆగస్టు 3: షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని బృందమ్మ కాలనీలో శనివారం వేకువజామున జరిగింది. బాధితురాలు కథనం మేరకు... బృందమ్మ కాలనీకి చెందిన నందిని, కుమార్ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. శనివారం వేకువజామున షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడ్డాయి. టీవీతో పాటు సమీపంలో ఉన్న దుస్తులు, పలు ఉపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాద ఘటనపై బాధితురాలు నందిని రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



రేణిగుంట, ఆగస్టు 3: తారకరామా నగర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం ఉదయం జరిగింది. రేణిగుంట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... అమరరాజా కర్మాగారం సమీపంలోని వంతెనపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. రేణిగుంట అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చేతులు, కాళ్లు ముడుచుకుని వుండటంతో ఫిట్స్ రావడంతో మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుంది. మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి కేసుగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఆగస్టు 3: పిచ్చాటూరు జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లను టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కళాశాలకు తరగతి గదుల కొరత ఉందని అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పిచ్చాటూరు హైస్కూలు ప్లస్ విద్యార్థినులను స్థానికంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టళ్లలో చేరేలా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎం గిరిప్రకాష్ విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంక్షేమ శాఖ జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఏర్పేడు, ఆగస్టు 3: ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ శనివారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ రోజుకు రూ.300 వేతనం అందేలా పనిచేయాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్‌లు తవ్వి వర్షపునీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రాజు, దేవరి, బాలాజీరావు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 3: పట్టణంలోని ఎస్పీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో మూడు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. కామర్స్ సబ్జెక్టులో 55శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ కలిగి ఉన్న వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ, యూజీసీ నెట్, ఎస్‌ఎల్‌ఈటీ, ఏపీసెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో ఈ నెల 9న ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఆర్థిక సాయం చేసి ఆదుకోండి

కానిస్టేబుల్ భార్య విన్నపం

పిచ్చాటూరు, ఆగస్టు 3: విధి నిర్వహణలో ఉంటూ ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన భర్త వైద్యం కోసం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలానికి కానిస్టేబుల్ ప్రభాకర్ భార్య కీర్తిక విజ్ఞప్తి చేశారు. కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తుండిన తన భర్తను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమై కోమా స్టేజ్‌లో ఉన్నారని తెలిపారు. చికిత్స కోసం ఇప్పటికే అప్పుచేసి రూ.40 లక్షలు ఖర్చు చేశామని, ఆపరేషన్ కోసం ఇంకా రూ.20 లక్షలు ఖర్చవుతుందని వేలూరు సీఎంసీ వైద్యులు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఆర్థికంగా ఆదుకోవాలని ఆదిమూలానికి వినతిపత్రం అందించి ప్రాధేయపడింది. అలాగే దాతలు కూడా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కీర్తిక విజ్ఞప్తి చేసింది.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

ఒకరికి తీవ్రగాయాలు

రేణిగుంట, ఆగస్టు 3: డివైడర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలైన ఘటన శనివారం తెల్లవారుజామున పట్టణంలోని వంతెన వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద చోటు చేసుకుంది. విమానాశ్రయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి విధులు ముగించుకుని తిరుపతికి వెళుతుండగా డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెనుక వస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించి చికిత్స నిమిత్తం బాలాజీ ఆస్పత్రికి తరలించారు.

సీఎంను కలిసిన శ్రీసిటీ ఎండీ



శ్రీసిటీ, ఆగస్టు 3: సీఎం చంద్రబాబును శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీసిటీ ప్రగతిని తెలియజేస్తూ, ప్రస్తుత సరిస్థితులపై చంద్రబాబుతో చర్చించారు. శ్రీసిటీని సందర్శించి, పారిశ్రామిక ప్రగతిని వీక్షించాలని ఆయన చంద్రబాబును ఆహ్వానించారు. పరిశ్రమ ఉత్పత్తులతో కూడిన మేకిన్ శ్రీసిటీ జ్ఞాపికను సీఎంకు రవీంద్ర సన్నారెడ్డి బహూకరించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

పిచ్చాటూరు, ఆగస్టు 3: సత్యవేడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యుత్‌శాఖ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ సురేంద్ర నాయుడును కోరారు. శనివారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఎస్‌ఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడు మండలం చమర్తికండ్రిగ, పిచ్చాటూరు మండలంలోని తులసికృష్ణాపురం (ముడియూరు), కేవీబీ పురంలోని కాళంగి గ్రామాల్లో సబ్‌స్టేషన్ల అవసరాన్ని వివరించారు.ఇందుకు ఎస్‌ఈ సానుకూలంగా స్పందించారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

వరదయ్యపాళెం, ఆగస్టు 3: మండలంలోని ఇందిరా నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో శనివారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.ఆర్‌ఐ వేణుగోపాల్ మాట్లాడుతూ ఇందిరానగర్‌లోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి పక్కన సీఎల్‌ఎన్‌పల్లి రెవెన్యూ సర్వే నెంబరు 307లో 2.77ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి కొందరు యత్నించారన్నారు. ఈ అంశంపై కోర్టుకు వెళ్లగా ఈ స్థలం ప్రభుత్వానిదే అని తీర్పు ఇచ్చిందని, ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హబీబ్, వీఆర్వో హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయ అభివృద్ధికి కృషి: సుధీర్‌రెడ్డి



గుడిమల్లం వెళ్లే రోడ్డు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, ఆగస్టు 3: గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చెప్పారు. గుడిమల్లం ఆలయ అభివృద్ధిపై మాజీ ఛైర్మన్, అధికారులతో శనివారం ఎమ్మెల్యే కసరత్తు చేశారు. వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. పాపానాయుడుపేట నుంచి స్వర్ణముఖి నది ఆనుకుని గుడిమల్లం వరకు రోడ్డును నిర్మించడానికి ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. అంతే కాకుండా తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాల నుంచి గుడిమల్లం ఆలయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అనేక మంది భక్తులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందులు పడ్డారని ఆలయ మాజీ ఛైర్మన్ బత్తల గిరినాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, జిల్లాస్థాయి అధికారులు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందులు పడిన పరిస్థితులను వివరించారు. ప్రధానంగా పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం వెళ్లే మార్గాన్ని వెడల్పు చేయాలని చెప్పారు. అందుకు సంబంధించి రేణిగుంట నుంచి గుడిమల్లం వెళ్లే మార్గాన్ని మ్యాప్ ద్వారా ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే పది రోజుల్లో గుడిమల్లం ఆలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రారెడ్డి, వేదపండితులు వంశీకృష్ణశర్మ, గుడిమల్లం మాజీ సర్పంచ్ పద్మనాభం నాయుడు, రత్నంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కుమారస్వామి పల్లకిసేవ



ప్రత్యేకాలకారంలో శ్రీవళ్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాళహస్తి, ఆగస్టు 3: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక వార్షికోత్సవాలలో చివరిరోజైన శనివారం ముక్కంటి ఆలయంలో శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి పల్లకిసేవ కనుల పండువగా సాగింది. శ్రీవల్లీ, దేవసేన సమేతుడైన కుమారస్వామి పురవీధుల్లో విహరిస్తూ పల్లకీలో విహరిస్తూ భక్తకోటికి నేత్రానందాన్ని కలిగించారు. విశేషోత్సవం సందర్భంగా ఉత్సవర్లకు విశేష స్వర్ణాంభరణాలు, ప్రత్యేక పుష్పమాలికతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించండి

సత్యవేడు, ఆగస్టు 3: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్(ఎస్‌ఎంసీ) ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈవో రవి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణపై హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల తల్లితండ్రులు, సంరక్షులను పాఠశాల కమిటీ మెంబర్లుగా ఎన్నుకుని, వారిలో నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ రవిచంద్రబాబు, ఎంఈవో-2 ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం

రేణిగుంట, ఆగస్టు 3: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం ఢిల్లీ నుంచి కుటుంబ సభ్యులతో కలిసి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకులు కోలా ఆనంద్, శాంతారెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, వరప్రసాద్, అజయ్ తదితరులు స్వాగతం పలికారు.

శ్రీసిటీలో నూతన చట్టాలపై అవగాహన

శ్రీసిటీ, ఆగస్టు 3: దేశంలో కొత్తగా అమలులోకి వచ్చిన నేర చట్టాలపై శనివారం శ్రీసిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్రాంత ఐజీ, కార్పొరేట్ సంస్థలకు క్రిమినల్ చట్టాల న్యాయ సలహాదారు దామోదర్ ముఖ్య అతిథిగా పాల్గొని, నూతన నేర చట్టాలలోని పలు కీలకాంశాలపై వివరణాత్మక ఉపన్యాసం చేశారు. శ్రీసిటీలోని పలు పరిశ్రమలకు చెందిన మానవ వనరుల విభాగం మేనేజర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, లీగల్ అధికారులు, స్థానిక పోలీస్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దామోదర్‌కు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి గతంలో నెల్లూరు ఎస్పీగా పని చేసిన దామోదర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

సంఘమిత్ర సునీతను విధుల్లోకి తీసుకోవద్దు

బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 3: డ్వాక్రా సంఘాల సభ్యుల నగదును స్వాహా చేసి సస్పెండ్ అయిన సంఘమిత్ర సునీతను మళ్లీ విధుల్లోకి తీసుకోవద్దని మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన మహిళా సమాఖ్య సభ్యులు స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఐదేళ్ల క్రితం 25 డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.12 లక్షలను స్వాహా చేసిన సంఘమిత్ర సునీతను అప్పట్లో అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారన్నారు. మళ్లీ ఆమెను సంఘమిత్రగా నియమించాలని ప్రయత్నించడం భావ్యం కాదన్నారు. అనంతరం ఐకేపీ ఏపీఎం ఇందిరమ్మకు వినతిపత్రం అందించారు.

గిరిజన హక్కుల పరిరక్షణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, ఆగస్టు 3: శ్రీకాళహస్తి పట్టణం ఊరందూరు రోడ్డులో గల బృందమ్మ కాలనీలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు వారి హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ విద్య, ఆరోగ్యం తప్పనిసరి అన్నారు. ఏదైనా సమస్యలుంటే కోర్టులో అర్జీ ఇస్తే ఉచిత సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. అలాగే వితంతు పింఛను అందనివారు అర్జీ ఇవ్వాలని సూచించారు. వైద్యశిబిరంలో ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అఫీజ్‌ఖాన్, పోలీసు అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, ప్రభుత్వాస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

గుడిలోకి రాకుండా అడ్డుకున్నారని ఫిర్యాదు

కేవీబీపురం, ఆగస్టు 2: మండలంలోని దర్బావారికండ్రిగ దళితులను గ్రామదేవత పొన్నాలమ్మ ఆలయంలోకి రానివ్వకుండా అగ్రవర్ణాల వారు అడ్డుకున్నారని శనివారం ఏఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. దర్బావారికండ్రిగ(బ్రాహ్మణచెరువు) గ్రామస్తులు అందరూ కలిసి గ్రామదేవత పొన్నాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించేవారు. అయితే గత నెలలో గ్రామస్తులు మాత్రమే అమ్మవారికి పూజలు నిర్వహించి దళితులను రానివ్వకుండా అడ్డుకున్నారు. దీనిపై ఏఎస్‌ఐ లోకనాథంకు ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేస్తామని ఏఎస్‌ఐ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి జనార్దన్, నాగరాజు, సంక్రాంతి వెంకటయ్య, చిన్నబ్బ, వెంకటయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గిరిజనుల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర రావు

పుత్తూరు, ఆగస్టు 3: గిరిజనులు ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకోవాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్రరావు అన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వినాయకపురం ఎస్టీ కాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం, హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల పిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని అన్నారు. వర్షాల నేపథ్యంలో నీటిని కాచి వడబోసి తాగాలని సూచించారు. అలాగే గిరిజనులు తమ హక్కుల గురించి అవగాహన కలిగి వుండాలన్నారు. సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల గురించి డాక్టర్లు వివరించారు. కాలనీవాసులకు ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి, డీటీ సురేష్‌రెడ్డి, డాక్టర్లు హేమశ్రీ, భార్గవి, ఆశ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం, మురళీ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వడమాలపేట, ఆగస్టు 3: తిరుపతి - చెన్నై జాతీయ రహదారి అంజేరమ్మ కనుమ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వడమాలపేటకు చెందని ఉమాశంకర్, చెంచయ్య బైక్‌లో పుత్తూరు నుంచి వడమాలపేటకు వెళ్తుండగా తిరుత్తణికి చెందిన అరుణ్ మోటార్ బైక్‌పై వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తిరుత్తణికి చెందిన అరుణ్‌తో పాటు ఉమాశంకర్, చెంచయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ ద్వారా పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు శిక్షణ

పుత్తూరు టౌన్, ఆగస్టు 3: పట్టణంలోని ఉన్నత పాఠశాలలో శనివారం వ్యాయామ ఉపాధ్యాయులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందడం వల్ల విద్యార్థులు సమాజ సేవపై అవగాహన కలిగి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరివాసులకు రుణపడి ఉంటా: భానుప్రకాష్



భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 3: ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన నగరి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం ఆయన బెంగళూరులో టీడీపీ, కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో భానుప్రకాష్ ముఖ్య అతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ స్వగ్రామాలకు వచ్చిన ఓట్లేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బెంగళూరులోని టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అదేవిధంగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, ఆరణి శ్రీనివాసులు, ప్రసాద్, సురేంద్రబాబును సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజేంద్ర నాయుడు, లీలా శంకర్‌రావు, యశ్వంత్, గజేంద్ర, రాజగోపాల్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రేపటి ధర్నాను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 3: చిరుద్యోగులను రాజకీయ కక్షతో అక్రమంగా తొలగించడం, వేధింపులకు గురిచేయటాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 5 తేదీన కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర పిలుపునిచ్చారు. శనివారం పుత్తూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర చిరుద్యోగులు చాలామందిని రాజకీయ కక్షతో వేధింపులకు గురిచేసి తొలిగించారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ 5వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు, చిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, విజయ్, నరసింహులు, యాసిన్‌బాషా, రమేష్, సుబ్రమణియం పాల్గొన్నారు.

తమిళ సినిమా చిత్రీకరణకు పూజలు



పూజలు చేస్తున్న సిబ్బంది

పుత్తూరు టౌన్, ఆగస్టు 3: శ్రీతేజ మూవీ మేకర్స్‌పై నిర్మించనున్న తమిళ సినిమా రాంగ్ కాల్ చిత్రీకరణకు శనివారం పుత్తూరు పట్టణంలోని ఏఎంసీ కల్యాణ మండలంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చిత్ర నిర్మాత లిరిక్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో యువత, మంచి నడవడిక సాధించడం కోసం జరిగే కథ సారంశమే సినిమాగా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్రీకరణ సిబ్బంది వీకే రాజేందర్, లాలు, రాజమిత్ర, డాక్టర్ దివాకర్, కరాతి రాజన్, విజయ్‌కాంత్, కవిత, రమేష్‌నాయుడు, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.